ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
మహబూబాబాద్
ఆదివారం 28 సెప్టెంబరు 2025






- జనరల్ కేటగిరీలో జిల్లా పరిషత్ చైర్మన్
- మొత్తం 482 సర్పంచ్, 193 ఎంపీటీసీ స్థానాలు
- 4,110 వార్డులకు.. ఎంపీపీ, జడ్పీటీసీలకు రిజర్వేషన్లు కేటాయింపు

# స్థానిక పోరుకు రిజర్వేషన్లు ఖరారు

మహబూబాబాద్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఎట్టకేలకు స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ కోసం 42 శాతం బీసీల రిజర్వేషన్లతో జడ్పీ చైర్మన్, జడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, వార్డు సభ్యుల రిజర్వేషన్లు శనివారం ఖరారు చేశారు. జిల్లా కలెక్టరేట్ కాంప్లెక్స్‌లో 18 మండలాల ఎంపీపీ, జడ్పీటీసీ స్థానాలకు రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తి చేశారు. మహబూబాబాద్, తొర్రూరు డివిజన్ కేంద్రాల్లో ఆర్డీవోల సమక్షంలో వారి పరిధుల్లోని మండలాలకు సంబంధించిన ఎంపీటీసీలు, గ్రామ సర్పంచ్‌లకు సంబంధించిన రిజర్వేషన్లను డ్రా పద్ధతిన కేటాయింపులు చేశారు. ఇక మండల పరిషత్ కార్యాలయాల్లో ఎంపీడీవోల సమక్షంలో వార్డు సభ్యుల రిజర్వేషన్లను ఖరారు చేశారు.



మానుకోట మండల పరిషత్ కార్యాలయంలో వార్డు సభ్యుల రిజర్వేషన్ కేటాయిస్తున్న ఎంపీడీవో రఘుపతిరెడ్డి

మహబూబాబాద్ జిల్లా ఆవిర్భావ తొలి జడ్పీ చైర్‌పర్సన్ ఎస్టీ మహిళకు రిజర్వు కాగా, రెండోసారి జరగనున్న ఎన్నికల్లో (ఈ సారి) ఓసీ జనరల్‌కు అవకాశం లభించింది. జిల్లా వ్యాప్తంగా 18 మండలాల జడ్పీటీసీలతో పాటు ఎంపీపీలు, ఎంపీటీసీల రిజర్వేషన్లు, జిల్లాలో 482 సర్పంచ్ స్థానాలతో పాటు వార్డు సభ్యుల రిజర్వేషన్లను ఖరారు చేశారు. అధికార వర్గాల నుంచి అందిన అనధికారిక సమాచారం మేరకు.. రిజర్వేషన్ల వివరాలు ఇలా ఉన్నాయి..

**ఎంపీపీ, జడ్పీటీసీ రిజర్వేషన్లు ఇలా..**

| మండలం | జడ్పీటీసీ | ఎంపీపీ |
|---|---|---|
| మహబూబాబాద్ | బీసీ జనరల్ | బీసీ జనరల్ |
| కురవి | ఎస్టీ మహిళ | బీసీ మహిళ |
| సీరోలు | ఎస్టీ జనరల్ | ఎస్టీ మహిళ |
| కేసముద్రం | ఎస్టీ మహిళ | ఎస్టీ జనరల్ |
| ఇనుగుర్తి | ఎస్టీ మహిళ | ఎస్టీ జనరల్ |
| డోర్నకల్ | ఎస్టీ జనరల్ | బీసీ మహిళ |
| నర్సింహులపేట | ఎస్టీ జనరల్ | ఎస్టీ మహిళ |
| చిన్నగూడూరు | ఎస్టీ జనరల్ | ఎస్టీ జనరల్ |
| పెద్దవంగర | ఎస్సీ జనరల్ | బీసీ జనరల్ |
| దంతాలపల్లి | ఎస్సీ మహిళ | ఎస్సీ జనరల్ |
| నెల్లికుదురు | బీసీ జనరల్ | ఎస్సీ మహిళ |
| తొర్రూరు | బీసీ మహిళ | బీసీ మహిళ |
| మరిపెడ | బీసీ మహిళ | బీసీ జనరల్ |
| బయ్యారం | బీసీ మహిళ | ఎస్టీ మహిళ |
| కొత్తగూడ | బీసీ జనరల్ | ఎస్టీ జనరల్ |
| గూడూరు | బీసీ జనరల్ | జనరల్ |
| గంగారం | జనరల్ | ఎస్టీ జనరల్ |
| గార్ల | జనరల్ మహిళ | ఎస్టీ మహిళ |



## మానుకోట మార్కెట్‌కు సెలవులు

మహబూబాబాద్ అగ్రికల్చర్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్‌కు ఈనెల 28వ తేదీ నుంచి అక్టోబర్ 5 తేదీ వరకు పండుగ సెలవులు ప్రకటించినట్లు చైర్మన్ ఇస్లావత్ సుధాకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం సద్దుల బతుకమ్మ, మంగళవారం దుర్గాష్టమి, బుధవారం మహర్ణవమి, అక్టోబరు 2న గాంధీజయంతితో పాటు విజయదశమి, 3న ప్రభుత్వ సెలవుతో పాటు శని, ఆది వారాలు వారాంతపు సెలవులు ఉన్నట్లు చెప్పారు. తిరిగి అక్టోబర్ 6న మార్కెట్‌లో క్రయవిక్రయాలు ప్రారంభమవుతాయని చెప్పారు.



## చేపల వేటకు వెళ్లిన వ్యక్తి గల్లంతు



వెంకటేశ్వర్లు (ఫైల్)

డోర్నకల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : డోర్నకల్ మునిసిపల్ కేంద్రం శివారులో మున్నేరు వాగులో చేపల వేటకు వెళ్లిన ఓ వ్యక్తి గల్లంతైన సంఘటన శనివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం. డోర్నకల్‌లోని అంబేద్కర్‌నగర్‌కు చెందిన బందెల వెంకటేశ్వర్లు (43) ఈ నెల 25న సాయంత్రం స్థానిక మున్నేరులో చేపల వేటకు వెళ్లాడు. వెళ్లిన ఆయన శుక్రవారం ఇంటికి రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబసభ్యులు స్థానిక మత్స్యకారులతో కలిసి మున్నేరు ఒడ్డున ఇరువైపుల గాలింపు చర్యలు చేపట్టారు. ఎంత అచూకీ లభించక పోవడంతో డోర్నకల్ పోలీస్‌స్టేషన్‌లో వెంకటేశ్వర్లు భార్య విజయ ఫిర్యాదు చేశారు. రాత్రి సమయం కావడం, మరోపక్క వర్షం కురుస్తుండడంతో అతని ఆచూకీ కోసం గాలించినా ఫలితం దక్కలేదు. శనివారం ఉదయం పోలీసులు, స్థానిక మత్స్యకారులు మున్నేరులో వెతికినప్పటికి ఎక్కడ కూడా వెంకటేశ్వర్లు అచూకీ తెలియలేదు. ఘటన స్థలాన్ని ఎస్సై ఉమ సందర్శించారు. అక్కడ వెంకటేశ్వర్లుకు సంబంధించిన సైకిల్, దుస్తులు, చెప్పు లు లభించినట్లు చెప్పారు. వ్యక్తి మున్నేరులో గల్లంతైనట్లుగా కేసు నమోదు చేశారు. వెంకటేశ్వర్లుకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

## జిల్లాలో మోస్తరు వర్షం

- గార్ల వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న పాకాల
- ఏడు గ్రామాలకు రాకపోకలు బంద్



గార్ల వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న పాకాల వాగు

మహబూబాబాద్ అగ్రికల్చర్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని పలు మండలాల్లో శుక్రవారం రాత్రి ఓ మోస్తరు వర్షం కురియగా, గార్లలో భారీవాన పడింది. డోర్నకల్, కొత్తగూడ, బయ్యారం, కేసముద్రం మండలాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. గార్లలో భారీ వర్షం కురియగా, శనివారం మధ్యాహ్నం వరకు మాములుగా కురిసిం ది. దీంతో పాకాల వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. పాకాలలోని లోలెవల్ బ్రిడ్జిపై నుంచి ఉధృతంగా నీరు ప్రవహిస్తోండడంతో రాంపురం, పులిగుట్టతండా, రాంపురం, కొత్తతండా, మద్దివంచ, రాముతండా, హున్యతండా, గొల్లచర్ల గ్రామాలకు మళ్లీ రాకపోకలు బంద్ అయ్యాయి. దాంతో ప్రజలు గార్ల మండల కేంద్రానికి వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. శనివారం మధ్యాహ్నం వరకు బయ్యారం, చిన్నగూడూరు, దంతాలపల్లి, గార్ల, కేసముద్రం, మహబూబాబాద్, గూడూరు, కొత్తగూడ, నెల్లికుదురు, పెద్దవంగర, తొర్రూరు మండలాల్లో ఓ మోస్తారు వర్షం కురిసింది. మిగతా మండలాల్లో చిరుజల్లులు కురిశాయి.

### 21.7 మిల్లీమీటర్ల వర్షపాతం..

జిల్లాలో శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం 8.30 గంటల వరకు 347.6 మిల్లిమీటర్ల వర్షపాతం నమోదైంది. సగటున 21.7 మిల్లిమీటర్ల వర్షం పడింది. గార్లలో 53.8, కొత్తగూడలో 33.8, గంగారంలో 26.4, బయ్యారంలో 31.4, డోర్నకల్‌లో 37.4, కురవిలో 13.8, మహబూబాబాద్‌లో 18.6, గూడూరులో 19.2, కేసముద్రంలో 31.2, నెల్లికుదురులో 9.6, నర్సింహులపేటలో 8.6, చిన్నగూడూరులో 8.4, మరిపెడలో 11.2, దంతాలపల్లిలో 10.6, తొర్రూరులో 15.4, పెద్దవంగరలో 18.2 మిల్లిమీటర్ల వర్షపాతం నమోదైంది.

## ఏపీ సీఎంను కలిసిన బండి పుల్లయ్య

నెహ్రూసెంటర్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని అమరావతి అసెంబ్లీ ఆవరణలో ముఖ్యమంత్రి చంద్రబాబును మహబూబాబాద్ మాజీ ఎమ్మెల్యే బండి పుల్లయ్య శనివారం మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. తె లంగాణ రాష్ట్ర ప్రస్తుత రాజకీయాలు, త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలపై చర్చించారు. రాష్ట్రంలో టీడీపీ బలోపేతానికి కృషి చేయాలని చంద్రబాబు సూచించినట్లు పుల్లయ్య తెలిపారు.



అమరావతిలో ఏపీ సీఎం చంద్రబాబుతో మాట్లాడుతున్న మానుకోట మాజీ ఎమ్మెల్యే బండి పుల్లయ్య



## కలెక్టరేట్‌లో బతుకమ్మ వేడుకలు



బతుకమ్మ వేడుకలో కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, అధికారులు, ఉద్యోగులు

మహబూబాబాద్ సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : కలెక్టరేట్ ప్రాంగణంలో శనివారం బతుకమ్మ వేడుకలను నిర్వహించారు. బతుకమ్మ ఉత్సవాలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్న సందర్భంగా కలెకరేట్‌లో అన్నిశాఖల ఉద్యోగులు పండుగను ఘనంగా నిర్వహించారు. కలెక్టరేట్‌లో పెద్ద బతుకమ్మను ఏర్పాటు చేసి, మహిళా ఉద్యోగులు బతుకమ్మ ఆడారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుతూ భావి తరాలకు అందించాలని సూచించారు. జిల్లా ప్రజలకు, మహిళా ఉద్యోగులకు బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా అదనపు కలెక్టర్లు లెనిన్‌వత్సల్ టొప్పో, కె.అనిల్‌కుమార్, సీడబ్ల్యూసీచైర్‌పర్సన్ డాక్టర్ నాగవాణి, అధికారులు సబిత, శిరీష, విజయ, శ్రీనివాసరావు, మరియన్న పాల్గొన్నారు.

## గిరిజన ఆత్మగౌరవ సభకు తరలిరండి

### మాజీ మంత్రి సత్యవతిరాథోడ్



మాట్లాడుతున్న సత్యవతిరాథోడ్

కురవి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్‌లో ఆదివారం నిర్వహిస్తున్న గిరిజన ఆత్మగౌరవ సభకు పెద్ద ఎత్తున గిరిజనులు తరలిరావాలని మాజీ మంత్రి సత్యవతిరాథోడ్ పిలుపునిచ్చారు. కురవి మండలం పెద్ద తండాలో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. గిరిజన ఆత్మగౌరవ సభ ఎవరికి వ్యతిరేకం కాదన్నారు. లంబాడీలను రాజ్యాంగా బద్ధంగా పార్లమెంట్‌లో ఆమోదంతో 1976లో ఎస్టీ జాబితాలో చేర్చారని, రాష్ట్రంలోని 40 లక్షల ఎస్టీ జనాభాలో 30 లక్షల మంది లంబాడీలు ఉన్నారని, మిగతా 10 లక్షలు 31 కులాల ఎస్టీలు ఉన్నారని చెప్పారు. అధిక జనాభా గల లంబాడీలకు రిజర్వేషన్ ఫలాలు అందడంలో తప్పులేదన్నారు. కొందరు స్వార్థంతో లంబాడీలపై తప్పుడు ప్రచారం కొనసాగిస్తూ కోర్టుకు వెళ్లారని విమర్శించారు. లంబాడీ జాతి బిడ్డల భవిష్యత్ కోసం మహబూబాబాద్‌లో జరిగే ఆత్మగౌరవ సభకు పెద్ద ఎత్తున తరలిరావాలన్నారు. ఈ విలేకరుల సమావేశంలో గుగులోతు శ్రీరాం, సిరినాయక్, రాందాస్, బిచ్చు, లక్ష్మణ్ పాల్గొన్నారు.

## మా తండాలో మా రాజ్యానికి పాడే కట్టేస్తున్న సీఎం

● లంబాడీల ఐక్య వేదిక రాష్ట్ర సమన్వయ కర్త జాదవ్ రమేశ్



మరిపెడలో మాట్లాడుతున్న జాదవ్ రమేశ్

మరిపెడ, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మా తండాలో మా రాజ్యానికి సీఎం రేవంత్‌రెడ్డి పాడే కట్టేస్తున్నారని లంబాడీల ఐక్య వేదిక రాష్ట్ర సమన్వయ కర్త జాదవ్ రమేశ్ అన్నారు. శనివారం ఆయన ఆ సంఘ ముఖ్య నేతలతో కలిసి మరిపెడ పట్టణంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గిరిజన తండాలను జీపీలుగా చేయాలని అనేక ఏళ్లుగా పోరాటం చేసి తండాలను పంచాయతీలుగా గుర్తింపు చేసుకున్నామన్నారు. ఆ కల ఐదేళ్లు కూడా నెరవేరకముందే సీఎం రేవంత్‌రెడ్డి తొంభైశాతం గిరిజన జనాభా ఉన్న తండాల్లో సైతం ఇతర కులాల వారికి రిజర్వేషన్లు వర్తింపచేసే కుట్రలు చేస్తున్నట్లు ఆరోపించారు. గత కేసీఆర్ ప్రభుత్వం 50 శాతంకు పైగా ఏ తెగలు ఉంటే వారికే రిజర్వేషన్ వర్తింప చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. స్థానిక ఎన్నికల రిజర్వేషన్లల్లో తేడా వస్తే లంబాడీల దెబ్బకు కాంగ్రెస్ ప్రభుత్వం కకాల వికలం అవుతుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఆ సంఘ నాయకులు శంకర్, భద్రు, రవీందర్, దేవ్‌సింగ్, నార్యా, రమేశ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు

తొర్రూరు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమ పోరాట యోధుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు శనివారం తొర్రూరులో మార్కండేయ చేనేత యువజన సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సంఘం గౌరవ అధ్యక్షుడు కందగట్ల సోమశేఖర్ కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం కోసం నిరంతరం పోరాటం చేసిన వ్యక్తి అని, ఆయన ఆశయాలను పద్మశాలీలు ముందుకు తీసుకెళ్లాలన్నారు. ఈకార్యక్రమంలో నాయకులు మోహన్, స్వామి, శ్రావణ్, శ్రీనివాస్, ఈశ్వర్, కస్తూరి పులేందర్, ఎనగందుల సంతోష్, బాస్కర్ తదితరులు ఉన్నారు.



# స్థానిక ఎన్నికల రిజర్వేషన్లు ఖరారు

తొర్రూరు రూరల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధమైన వేళా శని వారం మండలంలోని ఎంపీటీసీ, సర్పంచ్ స్థానాలకు తొర్రూరు ఆర్డీవో కార్యాలయంలో అధికారులు ఖరారు చేశారు. మండలంలో 31 గ్రామ పంచాయతీలు ఉండగా, 5గ్రామ పంచాయతీలు ఎస్సీ, 9గ్రామ పంచాయతీలు బీసీ, 5గ్రామ పంచాయతీలు జనరల్ కేటగిరిలుగా, ఎస్టీ 11 రిజర్వుడ్ స్థానాలుగా ఖరారు చేశారు. మండలంలోని 15 ఎంపీటీసీ స్థానాలు ఉండగా 3 ఎస్సీ, 7 బీసీ, 2 ఎస్టీ, 3 జనరల్ స్థానాలుగా రిజర్వేషన్లు ఖరారు చేశారు.



తొర్రూరు ఎంపీడీవో కార్యాలయంలో వార్డులకు రిజర్వేషన్ల లక్కీ డ్రా తీస్తున్న అధికారులు

### సర్పంచ్ స్థానాలకు..

గుర్తూర్ (ఎస్సీ మహిళ), చింతలపల్లి (ఎస్సీ మహిళ), వెల్లికట్టె (ఎస్సీ జనరల్), నాంచారిమడూరు (ఎస్సీ జనరల్), చెర్లపాలెం (ఎస్సీ జనరల్), కిష్టాపురం (ఎస్సీ మహిళ) ఖరారు చేశారు. కాగా, బీసీ సర్పంచ్ గ్రామ పంచాయతీలు సోమారం (బీసీ మహిళ), ఖానాపురం (బీసీ జనరల్), హరిపిరాల (బీసీ మహిళ), చీకటాయపాలెం (బీసీ జనరల్), ఫత్తేపురం (బీసీ జనరల్), మాటేడు (బీసీ జనరల్), పోలేపల్లి (బీసీ మహిళ), మడిపల్లి (బీసీ జనరల్), కంఠాయపాలెం (బీసీ మహిళ), జమస్థాన్‌పురం (జనరల్ మహిళ), అమ్మాపురం (జనరల్ మహిళ), గుడిబండ తండా (జనరల్), కర్కాల (జనరల్), గోపాలగిరి (జనరల్) స్థానాలుగా కేటాయించారు. ఎస్టీ రిజర్వుడ్ స్థానాలుగా అమర్‌సింగ్‌తండా (ఎస్టీ మహిళ), బోజ్యాతండా (ఎస్టీ మహిళ), దుబ్బతండా (ఎస్టీ మహిళ), ఈదులకుంటతండా (ఎస్టీ జనరల్), జీకేతండా (ఎస్టీ జనరల్), హచ్చుతండా (ఎస్టీ జనరల్), కొమ్మనపల్లితండా (ఎస్టీ మహిళ), పెదమంగ్యాతండా (ఎస్టీ జనరల్), సోమవారపుకుంటతండా (ఎస్టీ జనరల్), టీకార్యతండా (ఎస్టీ జనరల్) స్థానాలుగా ఖరారు చేశారు.

### ఎంపీటీసీ స్థానాలకు..

గుర్తూర్ (ఎస్సీ మహిళ), ఫత్తేపురం (ఎస్సీ జనరల్), మాటేడు (ఎస్సీ జనరల్), అమ్మాపురం-2 (ఎస్సీ మహిళ), సోమారం (బీసీ జనరల్) అమ్మాపురం-1 (బీసీ మహిళ), నాంచారిమడూరు (బీసీ జనరల్), చీకటాయపాలెం (బీసీ మహిళ), చెర్లపాలెం (బీసీ మహిళ), కంఠాయపాలెం (బీసీ జనరల్), చింతపల్లి (జనరల్ మహిళ), వెంకటాపురం (జనరల్), హరిపిరాల (జనరల్), మడిపల్లి (ఎస్టీ మహిళ), వెల్లికట్టె (ఎస్టీ జనరల్) రిజర్వేషన్లు ఖరారు చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీల్లోని వార్డుల రిజర్వేషన్లు పూర్తి చేశారు.

● పెద్దవంగర (ఆంధ్రజ్యోతి): మండలంలోని 26 గ్రామ పంచాయతీల స్థానిక ఎన్నికల రిజర్వేషన్లు శుక్రవారం ఖరారు చేశారు. బీసీ మహిళ గ్రామాలు 2, జనరల్ మహిళ గ్రామాలు 2, జనరల్ గ్రామాలు 9, బీసీ జనరల్ గ్రామాలు 3, ఎస్సీ మహిళ 1, ఎస్సీ జనరల్ 2, ఎస్టీ మహిళ గ్రామాలు 7 ఉన్నాయి. పెద్దవంగర (బీసీ మహిళ), ఉప్పరగూడెం (జనరల్ మహిళ), అవుతాపురం (జనరల్), పోచంపల్లి (ఎస్సీ జనరల్) గంట్లకుంట (బీసీ మహిళ), కాన్యాయిగూడెం (బీసీ జనరల్), కొరిపెల్లి (జనరల్), వడ్డెకొత్త పల్లి (ఎస్సీ మహిళ), పోచారం (బీసీ జనరల్), బొమ్మకల్ (బీసీ జనరల్), చిట్యాల (ఎస్సీ జనరల్), చిన్నవంగర (జనరల్ మహిళ), ఎల్బీతండా (జనరల్), బీసీతండా (జనరల్), వంపు తండా (జనరల్), బావోజీతండా (జనరల్), ఖండ్యతండా (ఎస్టీ మహిళ), రెడ్డికుంట తండా (ఎస్టీ మహిళ), రామచంద్రుతండా (జనరల్), బోత్తలతండా (జనరల్), టీక్యాతండా (జనరల్), మోత్యతండా (జనరల్), రామోజీతండా (ఎస్టీ మహిళ), రాజమాన్‌సింగ్ తండా (ఎస్టీ మహిళ), పడమటితండా (ఎస్టీ మహిళ), జయిరామ్‌తండా (ఎస్టీ మహిళ)గా రిజర్వేషన్లు కేటాయించారు. అలాగే మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీల వార్డుల రిజర్వేషన్లు ఎంపీడీవో వేణుమాధవ్, తహసీల్దార్ వీరగంటి మహేందర్ ఆధ్వర్యంలో డ్రా పద్ధతిలో కేటాయించారు.

### ఎంపీటీసీ, ఎంపీపీ, జెడ్పీటీసీ రిజర్వేషన్లు ఖారారు..

మండలంలో మొత్తం 26 గ్రామపంచాయతీలుగా ఉండగా మొత్తం 25,409 ఓటర్లు, వారిలో స్త్రీలు 12,898, పురుషులు 12,511 ఓటర్లు ఉన్నారు. మండలంలో 9ఎంపీటీసీ స్థానాలు, ఎంపీపీ, జెడ్పీటీసీ స్థానాలకు రిజర్వేషన్లు ఖారారు చేశారు. ఎంపీపీ బీసీ జనరల్, జెడ్పీటీసీ ఎస్సీ జనరల్‌గా, 9 ఎంపీటీసీ రిజర్వేషన్ల స్థానాలలో పెద్దవంగర (ఎస్సీ జనరల్), చిట్యాల (ఎస్సీ మహిళ), చిన్నవంగర (ఎస్సీ మహిళ), బొమ్మకల్ (జనరల్), అవుతాపురం (బీసీ జనరల్), గంట్లకుంట (బీసీ మహిళ), కొరిపెల్లి (ఎస్టీ జనరల్), వడ్డెకొత్తపల్లి (బీసీ జనరల్), పోచంపల్లి (బీసీ జనరల్) స్థానాలుగా కేటాయించారు.

● మరిపెడ (ఆంధ్రజ్యోతి) : మండలంలోని 49 జీపీలలో 396 వార్డులు ఉండగా మహిళల రిజర్వేషన్‌కై మరిపెడ పరిషత్ ఆఫీసులో వివిధ రాజకీయ పార్టీల సమక్షంలో లాటరీ పద్ధతి ద్వారా శనివారం ఎంపికచేశారు. మహిళలకు మొత్తం 198 వార్డులు రిజర్వ్‌చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో వేణుగోపాల్ రెడ్డి, ఎంపీవో సోంలాల్, ఆర్ఐ శరత్‌గౌడ్, మండల్ పరిషత్ ఆఫీస్ సిబ్బంది, వివిధ పార్టీలకు చెందిన రాజకీయ ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఎస్సారెస్పీ ఉప కెనాల్‌లో పడి మేకల కాపరి మృతి



మృతి చెందిన కృష్ణయ్య

దంతాలపల్లి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని 7ఎల్ ఉప కెనాల్‌లో మేకల కాపరికెళ్లిన మండల కేంద్రానికి చెందిన దూరు కృష్ణయ్య (45)శనివారం ప్రమాదవశాత్తు కాలువలో పడి మృతి చెందాడు. స్థానిక ఎస్సై రాజు కథనం ప్రకారం. మహబూబాబాద్ జిల్లా దంతాల పల్లి మండల కేంద్రానికి చెందిన దూరు క్రిష్ణయ్య రోజువారీగా తనకున్న 10 జతల మేకలతో వాటిని మేపేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో ఆయన గ్రామ సమీపంలో 7ఎల్ కెనాల్ వైపుకు మేకలను తీసుకెళ్లాడు. మేస్తున్న మేకలు నీటి ప్రవాహంలో ఇబ్బందులు పడుతుండడంతో వాటిని బయటికి కొట్టే క్రమంలో ప్రమాదవశాత్తు కెనాల్ నీటిలో పడి మృతి చెందాడు. మృతుడి కుమారుడు అనిల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం కోసం జిల్లా ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య ఏలేంద్ర, ఇద్దరు కుమారులు ఉన్నారు.

## ఇండ్లు పంపిణీ చేసేవరకు ఉద్యమిస్తాం

● సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్



ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందిస్తున్న సీపీఎం నాయకులు

తొర్రూరు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): తొర్రూరు పట్టణంలో నిర్మించి ఉన్న 280 డబుల్ బెడ్‌రూమ్‌లను అర్హులైన లబ్ధిదారులకు పంపిణీ చేయాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో శనివారం ఆర్డీవో కార్యాలయం ఎదుట లబ్ధిదారులతో భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ మాట్లాడుతూ గత ప్రభుత్వం నిర్మించి డబుల్ బెడ్‌రూం ఇండ్లు పంచకుండా ప్రజలను మోసం చేస్తున్నారని, 5 లక్షల డబుల్ బెడ్‌రూం ఇండ్లు కడితే 2 లక్షలు మాత్రమే పంచారని విమర్శించారు. ప్రభుత్వం ఏర్పడి 20 నెలలు అవుతున్నా కాంగ్రెస్ పార్టీ ఏ ఒక్కరికి కూడా ఇల్లు ఇవ్వలేదని ఎద్దేవాచేశారు. రాష్ట్రంలో జిల్లా కేంద్రాల్లో ప్రైవేటు వ్యక్తులు సాధించుకున్న ప్రభుత్వ భూములు పోరాటం చేసి పేదలకు పంచిన ఘనత సీపీఎందే అన్నారు. ఇళ్లు పంపిణీచేయాలని కోరుతూ గత 9రోజులుగా వివిధ దశల్లో నిరసన, ఆందోళనలు చేస్తున్నప్పటికీ ప్రభుత్వం అర్హులైన వారిని గుర్తించకపోవడం సిగ్గుచేటు అన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు. ప్రజా ప్రతినిధులు స్పందించి ఇండ్ల పంపిణీ చేయాలన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రం ఆర్డీవో కార్యాలయ ఏవోకు అందించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బొల్లం అశోక్, ఎమ్డీ.యాకూబ్, రాజన్న, సోమిరెడ్డి, దర్గయ్య, శ్రీను, వెంకటేశ్వర్లు, యాకయ్య, తదితరులు ఉన్నారు.

## చండికా హోమం



తొర్రూరులో చండికా హోమం నిర్వహిస్తున్న అర్చకులు

తొర్రూరు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తొర్రూరులోని భద్రకాళి ఆలయంలో 5వ రోజు అమ్మవారిని చండికా మాత అలంకరణ చేసి భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం ఆలయ అర్చకులు వెన్నప్ప సంతోష్ శర్మ ఆధ్వర్యంలో చండికా హోమం నిర్వహించారు. నవరాత్రి ఉత్సవాల్లో హోమం నిర్వహించుకోవడం అమ్మవారికి మొక్కులు చెల్లించుకోవడం భక్తులకు అపారమైన నమ్మకం అని, అక్టోబర్ 2వ తేదీ గురువారం ఆలయంలో ప్రత్యేక పూజలు, శమిపూజ ఉంటుందని భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలన్నారు. ఈకార్యక్రమంలో వెలుగు మురళి, సంతోష్, మల్లేశం, యాకయ్య, భక్తులు పాల్గొన్నారు.

### లలితా త్రిపుర సుందరీదేవిగా అమ్మవారు భక్తులకు దర్శనం

మరిపెడ (ఆంధ్రజ్యోతి): దేవీ శరన్నవరాత్రుల ఉత్సవాలలో భాగంగా మరిపెడ మండల్ పరిషత్ ఆఫీసులో ఏర్పాటు చేసిన దుర్గామాత శనివారం లలితా త్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈ సందర్భంగా అర్చకుడు ప్రసాద్‌శర్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి భక్తులకు తీర్థప్రసాదాలు అందచేశారు. కార్యక్రమంలో మాజీ వార్డు కౌన్సిలర్ విసారపు ప్రగతి శ్రీపాల్‌రెడ్డి, అల్వాల ఉపేందర్ పాల్గొన్నారు.

# ఆత్మగౌరవ ప్రతీక బతుకమ్మ

మహబూబాబాద్ డీసీహెచ్ఎస్ చింత రమేష్



బతుకమ్మ వేడుకలో పాల్గొన్న డీసీహెచ్ఎస్ చింత రమేష్, వైద్యులు

గూడూరు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): బతుకమ్మ పండుగ అంటేనే తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలను పరిమళింపచేసే వేడుక అని మహబూబాబాద్ జిల్లా వైద్య విధాన పరిషత్ ఏరియా కోఆర్డినేటర్ (డీసీహెచ్ఎస్) చింత రమేష్ అన్నారు. గూడూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు, సిబ్బంది బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకలకు డాక్టర్ చింత రమేష్ హాజరై మాట్లాడుతూ.. తెలంగాణ మహిళల ఐక్యతకు సృజనాత్మకతకు చాటిచెప్పే రంగురంగుల పూల పండుగ బతుకమ్మ అని, అందుకే ఈ పండుగ వచ్చిందంటే కొన్ని రోజుల పాటు మహిళలంతా సంబరాలు చేసుకుంటారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సూపరిండెంట్ డాక్టర్ వీరన్న, డాక్టర్ సునీత, డాక్టర్ స్రవంతి, డాక్టర్ చైతన్య, వైద్య సిబ్బంది అనూరాధ, ఇందిర, సమీన, వనిత, కలీం, శేఖర్, సాంబయ్య, లోకేష్, తిరుపతి, సంజీవ, కరుణాకర్‌రెడ్డి, జ్యోతి పాల్గొన్నారు.

## కుల హత్యలకు వ్యతిరేకంగా ఉద్యమించాలి



శిక్షణ తరగతుల్లో ప్రసంగిస్తున్న పీవోడబ్ల్యూ రాష్ట్ర కార్యదర్శి విజయ

గార్ల, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా మనువాద కుల హత్యలకు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమాలు నిర్మించాలని పీవోడబ్ల్యూ రాష్ట్ర కార్యదర్శి అందె మంగ విజయ పిలుపునిచ్చారు. శనివారంస్థానిక అంబేద్కర్ భవనంలో న్యూడెమోక్రసీ మండల కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'పార్టీ నిర్మాణం, పనివాదానం' అనే అంశంపై ఏర్పాటు చేసిన ఒకరోజు శిక్షణలో ఆమె పాల్గొని, మాట్లాడారు. నేడు భారత దేశంలో నరేంద్ర మోదీ ప్రభుత్వంలో మరోవాదం పేరుతో అనగారిన వర్గాల ప్రజలపై అత్యాచారాలు, హత్యలు పెరిపోతున్నాయని, వీటిని అదుపు చేయడంలో కేంద్రప్రభుత్వం విఫలం అందని విమర్శించారు. కార్యక్రమంలో న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య, వూకె పద్మ, జడ ఐలమ్మ, తుడుం అనురాధ, భిన్నక్క, ఎండీ కవిత, శారద, రమ, మారుతి సైదమ్మ, గోళ్ల సుజాత, గౌని పిచ్చమ్మ, సత్యవతి, మౌనిక పాల్గొన్నారు.

# రైతుల సంక్షేమమే సొసైటీ లక్ష్యం

● పీఏసీఎస్ చైర్మన్ చల్లా లింగారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న పీఏసీఎస్ చైర్మన్ చల్లా లింగారెడ్డి

గూడూరు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : రైతుల ఆర్థిక స్వావలంబనే గూడూరు సొసైటీ లక్ష్యమని పీఏసీఎస్ చైర్మన్ చల్లా లింగారెడ్డి అన్నారు. గూడూరు సొసైటీ కార్యాలయంలో మహాజన సభ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గూడూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో 1359 మంది ఎస్ఏవో అప్పుదారుల నుంచి అసలు, వడ్డీ కలుపుకుని రూ.10.40 కోట్లు, 88 మంది ఎల్‌టీ అప్పుదారుల నుంచి అసలు, వడ్డీ కలుపుకుని రూ.37 లక్షలు మొత్తం సంఘంలో 447 మంది రైతుల నుంచి రూ.10.78 కోట్లు రావాల్సి ఉందన్నారు. రైతులకు కాంప్లెక్స్ ఎరువులు డీఏపీ, యూరియా 35683 ఎరువుల బస్తాలు సకాలంలో అందించామని పేర్కొన్నారు. ఇందుకు గాను మార్క్‌ఫెడ్ వారికి 1.01 కోట్లను సకాలంలో చెల్లించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ వేం శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్లు యాకాంబ్రం, యాకయ్య, జైపాల్, యాకూబ్‌పాషా పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు పరామర్శ



వరమ్మ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న సత్యవతి, కవిత

డోర్నకల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): డోర్నకల్ మునిసిపల్ కేంద్రానికి చెందిన పోటు వరమ్మ గత వారం మృతి చెందారు. మరోపక్క ఇందిరనగర్‌కు చెందిన గండి వెంకమ్మ శుక్రవారం రాత్రి మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ మంత్రి సత్యవతిరాథోడ్, మాజీ ఎంపీ మాలోత్ కవిత శనివారం డోర్నకల్‌కు చేరుకుని మృతుల కుటుంబసభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. వారి వెంట బీఆర్ఎస్ నాయకులు సురేష్ కుమార్‌పాట్నీ(మన్నుపాట్నీ), యశోదర్‌జైన్, తేజావత్ రమేష్, బోర్రాజు శ్రీనివాస్, బోరగళ్ళ శరత్‌బాబు, గండి రాంమోహన్, పాండునాయక్, నాగేందర్, లక్ష్మణ్, కొత్త వీరన్నలు పాల్గొన్నారు.

# లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలి


ఆదివాసీ తెగల సమన్వయ కర్త రామకృష్ణ



కొమరంభీం విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఆదివాసీ నేతలు

బయ్యారం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : చట్టబద్ధతలేని లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించి, ఆదివాసీలకు న్యాయం చేయాలని తెలంగాణ స్టేట్ ఆదివాసీ 9 తెగల సమన్వయ కర్త చుంచు రామకృష్ణ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. శనివారం బయ్యారం, గంధంపల్లి, కొత్తపేట, నామాలపాడు గ్రామాలలో బైక్ ర్యాలీ చేపట్టిన ఆదివాసీలు.. అంబేద్కర్, కొమరంభీం, సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహాలకు పూలమాలలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజన్సీ ప్రాంతాలలో గత 40 ఏళ్లుగా ఆదివాసీల హక్కులను లంబాడీలు కాలరాస్తున్నారన్నారు. నేడు భద్రాచలంలో జరగబోయే జైఆదివాసీ కార్యక్రమానికి భారీగా తరలివచ్చి, జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఆదివాసీ జేఏసీ బయ్యారం మండల చైర్మన్ వర్స ప్రకాశ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అరుణ్ కుమార్, కృష్ణ, రాజేష్, శివకుమార్, వెంకన్న, రాజశేఖర్, సంపత్, శ్రీను, పుల్లయ్య, బాలరాజు, రామనర్సయ్య, సాగర్, బాబురావు, రాంమూర్తి, జంపన్న, నందు పాల్గొన్నారు.

## ఎంపీటీసీ స్థానాన్ని సీరోలులో కలుపొద్దు



చింతపల్లిలో జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తున్న గ్రామస్థులు

కురవి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : సీరోలు మండలంలోని చింతపల్లి ఎంపీటీసీ స్థానాన్ని సీరోలు ఎంపీటీసీలో కలపడాన్ని నిరసిస్తూ శనివారం గ్రామస్తులు 365జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు జెర్రిపోతుల రంగన్న, దొంగరి నర్సయ్య మాట్లాడుతూ.. గతంలో చింతపల్లి, అయ్యగారిపల్లి గ్రామాలు కలిసి చింతపల్లి ఎంపీటీసీ స్థానంగా కొనసాగిందని, ప్రస్తుతం చింతపల్లిని సీరోలు మండలంలో బలవంతంగా కలిపారని పేర్కొన్నారు. చింతపల్లి ఎంపీటీసీ స్థానాన్ని తీసివేసి అధిక జనాభా ఉన్న సీరోలు ఎంపీటీసీ స్థానంలో కలపడం వల్ల తమకు అన్ని విధాల నష్టం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. తమ గ్రామాన్ని కొత్తూరు(సి) గ్రామంతో కలిపి ఎంపీటీసీ స్థానంగా చేయాలని డిమాండ్ చేశారు. ఈ రాస్తారోకోలో మామిండ్ల వెంకన్న, హత్తిరాం, దీరావత్ వీరన్న, మూడ్ రవీందర్, ఎస్‌కె. జాని, పాముర్తి వెంకన్న, నెర్సు శ్రీశైలం, మల్సూర్ పాల్గొన్నారు.

## యువత క్రీడల్లో రాణించాలి

కొత్తగూడ ఎస్సై రాజ్‌కుమార్

కొత్తగూడ, సెప్టెంబర్ 27 (ఆంధ్రజ్యోతి) : యువత క్రీడల్లో రాణించాలని కొత్తగూడ ఎస్సై రాజ్‌కుమార్ అన్నారు. కొత్తగూడ పోలీస్‌స్టేషన్‌లో శనివారం కార్లాయి గ్రామ యువకులకు వాలీబాల్ క్రీడా సామగ్రిని ఆయన అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువత చెడుమార్గంలో నడవకుండా సన్మార్గంలో వెళ్లాలని సూచించారు. డ్రగ్స్, గంజాయిలాంటి మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో కార్లాయి మాజీ ఉపసర్పంచ్ కేదాసు ప్రసాద్, యువకులు పాల్గొన్నారు.




పోలీస్‌స్టేషన్‌లో వాలీబాల్ క్రీడా సామగ్రిని అందజేస్తున్న ఎస్ఐ రాజ్‌కుమార్

# బలాన్నిచ్చే బతుకమ్మ ఫలహారాలు

- ఎన్నెన్నో ఆరోగ్య పోషకాలకు నిలయం
- తొమ్మిది రోజులు తొమ్మిది రకాలు
- తరతరాలుగా కొనసాగుతున్న సంప్రదాయం

వర్ధన్నపేట, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఆడపడుచుల్లో బతుకమ్మ పండుగా ఆరోగ్యకాంతులను వెలిగిస్తోంది. బతుకమ్మ ఆడిన తర్వాత సద్ది పేరుతో 'ఇచ్చినమ్మ వాయినం... పుచ్చుకుంటినమ్మ వాయినం' అంటూ అతివలు ఫలహారాలను పరస్పరం ఇచ్చిపుచ్చుకుంటారు. వీటిలో అనేక పోషక విలువలు ఉన్నాయంటున్నారు వైద్యులు. ఆటపాటలు, మానసికోల్లాసమే కాదు శరీరానికి కావాల్సిన అనేక పోషకాలను ఫలహారాల రూపంలో బతుకమ్మ అందిస్తోంది.




### బతుకమ్మ సద్దిలో ఐరన్

భారతీయ మహిళల్లో ఐరన్ లోపం కనిపిస్తోందని నివేదికలు వెల్లడిస్తున్నాయి. ఈ ప్రభావం పిల్లల్లోనూ ఉంటోంది. బతుకమ్మ వేడుకల్లో తయారు చేసుకునే సద్దిలో ఐరన్ శాతం అధికంగా ఉంటుందని నిపుణులు పేర్కొంటున్నారు. తొమ్మిది రోజులు తొమ్మిది రకాల ఫలహారాలను తయారు చేస్తారు. ఇందులో సత్తుపిండి, సద్ద ముద్దలు, నవ్వులు, కొబ్బరి, పల్లిపొడి లేదా ముద్దలు తదితర ఫలహారాలు ఉంటాయి. ఇవన్నీ పండుగ సమయానికి చేతికి వచ్చే చిరుధాన్యాలు. వీటిని తింటే ఆరోగ్యకరమని పెద్దలు చెబుతున్నారు.









### నువ్వుల ముద్దలు

బతుకమ్మ పండుగలో నువ్వులు ప్రాధాన్యం అంతాఇంతా కాదు. వీటితో పొడి చేస్తారు. నవ్వుల్లో ఎమినోయాసిడ్లు అధికంగా ఉంటాయి. ఇవి శరీరానికి చాలా ముఖ్యమైనవి. జింక్, కాల్షియం ఎముకల దృఢత్వాన్ని పెంచుతుంది.

### పెసర ముద్దలు

పెసళ్లను ఉడకబెట్టి బెల్లం కలిపి ముద్దలుగా తయారు చేస్తారు. ఇవి జీర్ణశక్తిని పెంచుతాయి. జీర్ణ సంబంధిత వ్యాధులనూ తగ్గిస్తాయి.

### కొబ్బరి పొడి, పెరుగన్నం, పులిహోర

కొబ్బరిలో ప్రోటీన్లు అధికంగా ఉంటాయి. మహిళల ఆరోగ్యానికి చాలా ఉపయోగపడుతుంది. పెరుగన్నం, పులిహోర ఇటీవల సద్దిగా ఇస్తున్నారు. పెరుగన్నంలో పల్లీలు, వివిధ రకాల ధాన్యాలు కలుపుతున్నారు. పులిహోర కూడా ప్రసాదంగా వాడుతున్నారు. చింతపండు గుజ్జుల్లో విటమిన్ సి అధికంగా ఉంటుంది. పెరుగులో పోషక విలువలు మెండు. అన్నం కలిపి కమ్మనైన నైవేద్యాన్ని సమర్పిస్తారు. ఇందులో ప్రోటీన్, కాల్షియం, రిబోఫ్లా విటమిన్, విటమిన్ బి-6, బి12, వంటి పోషకాలు అధికంగా ఉంటాయి. కొవ్వు తక్కువగా ఉండే పెరుగులో లాక్టోబసిల్లై అధికంగా ఉంటుంది. అపెండిసైటీస్, డయేరియా, డిసెంట్రీ వంటి వ్యాధులకు కారణమయ్యే బాక్టీరియాను లాక్టిక్ యాసిడ్ నాశనం చేస్తుంది. పెరుగులో ఉండే విటమిన్ నిరోధక శక్తిని పెంచుతుంది.

### సద్దుల్లో పోషకాలు

బతుకమ్మ ఉత్సవాలు వస్తే అందరికీ సద్ద ముద్దలు (సజ్జ ముద్దలు) గుర్తుకొస్తాయి. ఈ పేరుతోనే పెద్దబతుకమ్మ సద్దుల బతుకమ్మ అని పేరు వచ్చిందని చెబుతారు. సందె వేళలో చేసే బతుకమ్మ కాబట్టి సద్దుల బతుకమ్మ అంటారని మరో చరిత్ర. సజ్జలను పిండిగా పట్టించి బెల్లం కలిపి ముద్దలు చేస్తారు. కొందరు వీటికి నెయ్యి కూడా కలుపుతారు. వీటిలో పీచు పదార్థాలు ఎక్కువ. కార్బొహైడ్రేట్స్ తక్కువ. ప్రోటీన్లు, కాల్షియం అధికంగా ఉంటాయి. త్వరగా జీర్ణమవుతుంది. దీనికి బెల్లం కలపడంతో ఐరన్ శాతం పెరిగి మహిళల రుతుక్రమ సమస్య నివారణ, గొంతు నొప్పి తగ్గిస్తుందని వైద్యులు వివరిస్తున్నారు.

### పల్లి పిండి

పల్లిపిండి శరీర ఎదుగుదలలో అత్యంత ప్రధానమైనది. అధిక ప్రోటీన్లతో పాటు రుచికరంగా ఉంటాయి. చాలామంది ఇష్టంగా తింటారు. దీనికి బెల్లం జోడించడంతో పోషకాలు లభిస్తాయి.

**పోషకాలు పుష్కలం**


**డాక్టర్ బెతం నర్సింహస్వామి, వర్ధన్నపేట ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్**



బతుకమ్మ పండుగకు తయారు చేసే సత్తుపిండిలో వ్యాధి నిరోధక శక్తి పెంచే పోషకాలు ఉంటాయి. రుచికరంగా ఉండే సత్తుపిండి పిల్లలకు ప్రోటీన్లు అందిస్తాయి. కండరాల పటిష్ఠత, ఎముకల గట్టితనం, పిల్లల ఎదుగుదల... ఇలా అనేక ఉపయోగాలున్నాయి. సంప్రదాయ పిండి వంటలను ప్రతిఒక్కరూ తినాలి. బతుకమ్మ ఆరోగ్యాన్ని పంచే ప్రత్యేకమైన పండుగ.

## జాతి వైరం విడిచి..

- పిల్లి పిల్లను సాకుతున్న తల్లి కోడి
- మాతృ ప్రేమను పంచుతున్న కోడి



నెక్కొండ, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): సాధారణంగా జంతువుల మధ్య వైరం ఉండడం సహజం. ఆహారం మొదలు ప్రతీ విషయంలో ఒక జాతి జంతువులు మరో జాతి జంతువులతో పొట్లాటకు దిగుతుంటాయి. కోడి పిల్లలను పిల్లులు వెంటాడి, వేటాడి తింటుంటాయి. కానీ వరంగల్ జిల్లా నెక్కొండ మండలం బీసీ కాలనీకి చెందిన పొట్లపల్లి వీరస్వామి ఇంట్లో ఉంటున్న పిల్లి తల్లి రెండు నెలల కిందట చనిపోయింది. అప్పటి నుంచి కోడి తన పిల్లలతో పాటు పిల్లి పిల్లను సాకుతోంది. రాత్రి సమయంలో పిల్లి కోడి వద్దనే నిద్రిస్తోంది. జాతి వైరం మరిచి పిల్లి పిల్లను తల్లి కోడి సాకుతూ మాతృ ప్రేమను చాటుకుంటోంది. ఈ విషయంపై స్థానికులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

## ఒక్క ఓటుకు రిజర్వేషన్ కేటాయింపు..!

**ఆశాలపల్లి గ్రామంలో ఎస్సీకి రిజర్వు**

సంగెం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆ గ్రామంలో ఎస్సీ సామాజిక వర్గం నుంచి ఒక్కరు మాత్రమే ఉన్నారు. పోటీ చేద్దామన్నా ప్రత్యర్థి కూడా ఆ సామాజిక వర్గం నుంచి లేకపోవడం గమనార్హం. వరంగల్ జిల్లా సంగెం మండలంలోని ఆశాలపెల్లి గ్రామం సర్పంచ్ రిజర్వేషన్ల కింద ఎస్సీ మహిళకు కేటాయించారు. కానీ, అక్కడ ఎస్సీ ఓటర్లు ఒక కుటుంబం మాత్రమే ఉంది. మన్నెం మల్లమ్మ అనే మహిళకు ఇక్కడి ఓటు హక్కు కలిగి ఉండగా, భర్త వెంకటయ్య ఇటీవల చెరువులో పడి మృతి చెందాడు. వీరికి ఇద్దరు కూతుర్లు కాగా, వారి వివాహాలు సైతం చేశారు. మల్లమ్మ కూలీ చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. ఇక దీనిపై గ్రామస్థులు సైతం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఒక్క ఓటు మాత్రమే ఉన్న వర్గానికి ఎలా రిజర్వేషన్ కేటాయిస్తారని, దీన్ని రద్దు చేయాలని కోరారు. ఇక ఇదే మండలంలోని వంజరపల్లి గ్రామంలో ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన వారు ఎవ్వరూ లేకపోయినా, సర్పంచ్ స్థానాన్ని ఎస్టీ జనరల్‌కు కేటాయించారు. దీంతో గ్రామస్థులు సైతం ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

# పండుగల వేళ సమ్మెలో టైలర్ వర్కర్లు

- కూలీ రేట్లు పెంచాలని డిమాండ్
- డిప్యూటీ లేబర్ కమిషనర్‌కు వినతి



డిప్యూటీ లేబర్ కమిషనర్ కార్యాలయం ఎదుట గుమికూడిన టైలర్ వర్కర్లు

బాలసముద్రం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): సద్దుల బతుకమ్మ, దసరా పండుగల ముందు హనుమకొండలోని టైలర్ వర్కర్లు శనివారం సమ్మె చేపట్టారు. రెండేళ్లకోసారి వర్కర్ల కూలీ రేట్లను పెంచడం ఆనవాయితీగా వస్తుండగా ఈ యేడు టైలర్ షాపుల యాజమాన్యాలు వర్కర్ల కూలీ రేట్లను పెంచలేదు. కూలీరేట్లను పెంచాల్సిందిగా నాలుగు నెలల నుంచి యాజమాన్యాలను వేడుకుంటున్నా పెంచడం లేదని వర్కర్లు డిప్యూటీ లేబర్ కమిషనర్‌ను ఆశ్రయించారు. డిప్యూటీ కమిషనర్ ఇరు వర్గాలతో ఉమ్మడి సమావేశం ఏర్పాటుచేసి సయోధ్య చేకూర్చే ప్రయత్నం చేసినా ఫలించలేదు.

కాగా, అన్ని పండుగలకంటే బతుకమ్మ, దసరా పండుగలకు అందరు కొత్త దుస్తులు ధరించడం సంప్రదాయంగా వస్తోంది. టైలర్లకు కూడా ఈ పండుగల సమయంలో విపరీతమైన గిరాకీ ఉంటుంది. టైలర్ షాపుల యాజమాన్యాలు షర్టుకు రూ.700, ప్యాంటుకు రూ.900 తీసుకుంటూ తమకు మాత్రం షర్టుకు రూ.174, ప్యాంటుకు రూ.280 మాత్రమే చెల్లిస్తున్నారని వర్కర్లు వాపోతున్నారు. రెండేళ్ల కిందట షర్ట్‌కు రూ.19, ప్యాంటుకు రూ.31 పెంచామని, ఈ యేడు కూడా అదే రేట్లను మళ్లీ పెంచుతామని చెబుతున్నా.. వర్కర్లు వినిపించుకోవడం లేదని యజమానులు తెలిపారు. తమకు కూడా మెటీరియల్‌కు, షాపుల అద్దెలు పెరిగాయని, గిరాకీ కూడా తక్కువైందని అంటున్నారు. రేట్లు ఎక్కువగా పెంచితే తమకు గిట్టుబాటు కాదని చెబుతున్నారు. ఇరువర్గాలకు ఆమోదయోగ్యంగా ఉండే విధంగా కూర్చొని మాట్లాడుకుందామని వర్కర్లకు విజ్ఞప్తి చేస్తున్నారు. సమ్మె వల్ల యాజమాన్యాలు, వర్కర్లు ఇరు వర్గాలు నష్టపోతారని, వర్కర్లు గుర్తించాలని యాజమాన్యాలు కోరుతున్నాయి.

# పర్యాటక ప్రాంతాలకు నెలవు.. వరంగల్

- ఆర్‌డీవో రమేష్ రాథోడ్
- హరిత కాకతీయలో పర్యాటక ఉత్సవాలు



ఉత్సవాలను ప్రారంభిస్తున్న ఆర్‌డీవో రమేష్ రాథోడ్




సాంస్కృతిక ప్రదర్శన ఇస్తున్న విద్యార్థినులు

బాలసముద్రం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): చరిత్రను, సంస్కృతిని తెలిపే గొప్ప పర్యాటక ప్రాంతాలు ఉన్న ప్రదేశం ఉమ్మడి వరంగల్ జిల్లా అని హనుమకొండ ఆర్డీవో రమేష్ రాథోడ్ అన్నారు. సెప్టెంబరు 27న ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం హరిత కాకతీయలో సాంస్కృతిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. జిల్లా పర్యాటక శాఖ అధికారి ఎం.శివాజీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని అధ్యక్షత వహించారు.

ఈ కార్యక్రమంలో రమేష్ రాథోడ్ మాట్లాడుతూ.. జిల్లా పర్యాటక రంగం అభివృద్ధికి సూచికగా ఎదుగుతుందని అన్నారు. రామప్ప, లక్నవరం చెరువులు, మేడారం, వేయిస్తంభాల ఆలయాలు, ఖిలా వరంగల్ లాంటి పర్యాటక ప్రాంతాలు ఎంతగానో ఆకట్టుకుంటున్నాయని అన్నారు. జిల్లా పర్యాటక శాఖ అధికారి శివాజీ మాట్లాడుతూ.. టూరిజం పొటెన్షియల్ ఉన్న ప్రాంతాలను గుర్తించి అభివృద్ధిపర్చడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని అన్నారు. పర్యాటక ఆకర్షణలు పెంచడానికి, దేశ విదేశీ పర్యాటకులను వరంగల్‌కు రప్పించడానికి ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. మిస్‌వరల్డ్‌లో పాల్గొన్న సుందరీమణులను నగరానికి తీసుకు రావడం వల్ల జిల్లా కీర్తి విశ్వవ్యాప్తమైందని అన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పర్యాటక రంగంపై నిర్వహించిన వ్యాస రచన, చిత్రలేఖనం పోటీల్లో విజేతలైన విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందజేశారు.

### ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

పర్యాటక ఉత్సవాల్లో భాగంగా తాడూరి రేణుక శిష్య బృందం నిర్వహించిన నృత్యాలు అలరించాయి. పర్యాటక ప్రాంతాలను తెలిపే గీతంతోపాటు బతుకమ్మ ప్రత్యేక గీతానికి కళా బృందం చేసిన నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ప్రముఖ సామాజిక వేత్త నిమ్మల శ్రీనివాస్ వాఖ్యాతగా వ్యవహరించిన ఈ కార్యక్రమంలో పర్యాటక శాఖ అధికారులు హరిత కాకతీయ మేనేజర్ శ్రీధర్, డీఆర్‌డీఏ ప్రాజెక్టు మేనేజర్ శ్రీనివాస్, ట్రెజరీ ఆఫీసర్ శ్రీనివాస్‌కుమార్, కుమారస్వామి, ధన్‌రాజ్, కుసుమ సూర్యకిరణ్, లోకేశ్వర్, చిరంజీవి, శరత్, సతీష్, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రకృతి ప్రసాదం.. సీతాఫలం..

- ఒత్తిడిని తగ్గించి, నిద్రను మెరుగుపరిచే ఔషధం
- రోగ నిరోధక శక్తిని పెంచే మధురఫలం
- పేదోడి ఆపిల్‌గా దీనికి పేరు..
- నగరంలో ఇప్పటికే ప్రారంభమైన అమ్మకాలు



గ్రామాల నుంచి అమ్మకానికి తీసుకొచ్చిన సీతాఫలాలు

మామునూరు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి మనకు అందించే అద్భుతమైన ప్రసాదం పండ్లు. ఆరోగ్యానికి అంతకు మంచిన ఔషధాలు ఉండవు అంటే అతిశయోక్తి కాదు. సీజన్ వారీగా లభించే పండ్లలో సీతాఫలం ఒకటి. వాటికి అనేక ప్రత్యేకతలు ఉన్నాయి. బాగా పండిన సీతాఫలం లోపల తియ్యని గుజ్జుతో నల్లని విత్తనాలతో మధురమైన రుచిని కలిగి ఉంటుంది. సహజంగా పండిన సీతాఫలాల రుచి గురించి ఎంత చెప్పినా తక్కువే.. శీతాకాలంలో మాత్రమే కాసే సీతాఫలం కోసం ఏడాది మెత్తం ఎదురు చూసే వారున్నారు. మామిడి పండ్లకు ఏమాత్రం తీసిపోని క్రేజ్ సీతాఫలాలది. కేవలం రుచికే కాదు.. ఆరోగ్యాన్ని చేకూర్చడంలో కూడా సీతాఫలం ఓ మెట్టు పైనే ఉంటుంది. సీతాఫలం తినడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది. జీర్ణక్రియ మెరుగుపడుతుంది. చర్మం మెరుస్తుంది. గుండె ఆరోగ్యంగా ఉండడానికి దోహదపడుతుంది.



### ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు..

పేదోడికి అందుబాటులో ఉండి ఉత్తమ పోషక విలువలు కలిగిన ఫలం సీతాఫలం. దీనికి పేదోడి ఆపిల్ అనికుడా పేరొచ్చింది. గుండె ఆరోగ్యాన్ని మెరుగు పరచడంలో ఇందులోని పోషకాలు సహాయపడుతాయి. దీనిలో ఉండే బి6 విటమిన్‌తో శ్వాసకోశ సమస్యలనుంచి ఉపశమనం పొందవచ్చు. ఎసిడిటీని తగ్గిస్తుంది. వీటిలో కెరొటినాయిడ్స్, విటమిన్ సీ, యాంటీ ఆక్సిడెంట్లు, వనాయిడ్స్ ఎక్కువ మొత్తంలో ఉండటంతో రోగనిరోధక శక్తిని పెంచుతుంది. అంతేకాక చర్మ సౌందర్యాన్ని పెంచుతుంది. జ్వరం ఉన్నవారికి ఇవి మేలు చేస్తాయి. అధిక బరువుతో బాధపడేవారు రోజూ ఒక సీతాఫలాన్ని తినడంద్వారా త్వరగా సన్నబడుతారని నిపుణులు చెపుతున్నారు.

### ధర తక్కువే..

శీతాకాలంలో మాత్రమే లభించే సీతాఫలాలను గ్రామీణ ప్రాంతాలనుంచి తీసుకువచ్చి పట్టణ శివారు ప్రాంతాల్లో అమ్ముతుంటారు. ఇంకా సీజన్ ఆరంభం కాకముందే ఈ ఏడాది సీతాఫలం అమ్మకాలు చాలా తక్కువ ధరలకే లభిస్తున్నాయి. పట్టణ ప్రజలు, వీటి పోషక విలువలు తెలిసిన వారు ఇప్పటికే కొనుగోలు చేస్తున్నారు. ఒక్కో సీతాఫలం రేటు రూ.15 నుంచి రూ.20 వరుకు అమ్ముతున్నారు. కిలోల చొప్పున కేజీకి రూ. 70 నుంచి రూ.85 రూపాయల వరకు అమ్ముతున్నారు. మిగతా పండ్లతో పోలిస్తే చాలా తక్కువ ధరకే లభించడం విశేషం.

**పోషకాలు పుష్కలం..**

సీతాఫలాల్లో పోషకాలు అధికంగా ఉంటాయి. వీటిని ఇష్టపడనివారు ఉండరు. ఇందులో ఉండే విటమిన్-సీ, విటమిన్ బి6, ఫైబర్ కాల్షియం, ఆంటీ ఆక్సిడెంట్లు, పీచు పదర్థాలు, ఖనిజ లవణాలు, మెగ్నీషియం, మాంసంకృత్తులు పుష్కలంగా ఉంటాయి. ఇవి తెల్ల రక్తకణాలను ఉత్పత్తి చేస్తాయి. జీర్ణ సంబంధ సమస్యలు తొలగించడంలో సహాయపడుతాయి.

# 29వ తేదీనే సద్దుల బతుకమ్మ

- శాస్త్ర నియమం కాదు.. బతుకమ్మ సంప్రదాయ పర్వం
- పండితుల ఏకాభిప్రాయం



మాట్లాడుతున్న సుదర్శనాచార్యులు

హనుమకొండ కల్చరల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): సద్దుల బతుకమ్మ విషయంలో గందరగోళం జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ నెల 29వ తేదీనే జరుపుకోవాలని కొందరు, 30న జరుపుకోవాలని మరికొందరు పండితులు ఏకాభిప్రాయానికి రాని నేపథ్యంలో శనివారం అనేక మంది ప్రముఖులు ఈ విషయంపై స్పందించారు. ప్రధానంగా ఈ ప్రాంతంలో ప్రముఖ జ్యోతిష్య, వాస్తు పండితుడిగా చెలామణిలో ఉన్న ఊకల్ నాగేంద్రస్వామి ఆలయ ప్రధాన అర్చకుడు సముద్రాల సుదర్శనాచార్యులు ప్రతిస్పందించారు. శాస్త్ర నియమం కాదు.. బతుకమ్మ విషయంలో సంప్రదాయ పర్వం కాబట్టి మెజార్టీ మహిళల అభిప్రాయమే ప్రధానమన్నారు. కచ్చితంగా సద్దుల బతుకమ్మను 29న సోమవారం జరుపుకోవడం ప్రాంతీయ ఆచారమని ఆయన పేర్కొన్నారు. బతుకమ్మ విషయంలో తిథి వార నక్షత్రం, యోగం, కరుణం లాంటి నియామకాలు ఉండవన్నారు. 6వ రోజు అర్రెంగా భావిస్తు బతుకమ్మను కొంతమంది ఆడరని, అదే క్రమంలో 9వ రోజు నిమజ్జనోత్సవం జరిగి తీరాలన్నది ఆయన స్పష్టం చేశారు. బతుకమ్మ విషయంలో ఎవరెన్ని చెప్పినా 9వ రోజు నిమజ్జనం చేయడం సనాతన సంప్రదాయమని ఆయన పేర్కొన్నారు.

అలాగే ఎవరెన్ని చెప్పినా సంప్రదాయ నియమం ప్రకారం 29వ తేదీనే మహిళలు సద్దులు జరుపుకొని తీరాలని పండితులు ఏకాభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. వరంగల్ జిల్లా బ్రాహ్మణ సేవా సమాఖ్య అధ్యక్షుడు ఉదయమర్రి కృష్ణమూర్తి, వరంగల్‌లోని ఆకారపు గుడి ప్రధాన అర్చకుడు జిల్లా బ్రాహ్మణ సేవా సంఘం ప్రధాన కార్యదర్శి లంకా శివకుమార్, రాష్ట్ర పురోహిత సంఘం అధ్యక్షులు తాండ్ర నాగేంద్రశర్మ, మరో ప్రముఖ వేద పండితుడు గ్రేటర్ హైదరాబాద్ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు గన్ను సత్యనారాయణశర్మ, హనుమకొండలోని పద్మాక్షి ఆలయ ప్రధాన అర్చకుడు నాగిళ్ల శంకరశర్మ, ఐనవోలు ఆలయ వేద పండితుడు మధుశర్మ, వరంగల్ నగరంలోని ప్రముఖ జ్యోతిష్యకారుడు సుమన్ శర్మ, జనగామలోని శ్రీ వెంకటేశ్వర ఆలయ వ్యవస్థాపకుడు, సిద్ధాంతి సంపత్‌కుమారకృష్ణమాచార్యులు లాంటి అనేక మంది ప్రముఖులు బతుకమ్మ విషయంలో ఎలాంటి వివాదాలకు తావులేదన్నారు. సోషల్ మీడియా ద్వారా ఎవరికి వారు సద్దుల బతుకమ్మ విషయంలో 29వ తేదీన జరుపుకోవాలని ప్రజలకు తెలియజెప్పారు. ఆదివారం హనుమకొండలోని బ్రాహ్మణ భవన్‌లో పండితులంతా సమావేశమై ప్రజలకు స్పష్టత ఇచ్చేందుకు సమావేశం అవుతున్నట్లు తెలిసింది. ఇదిలా ఉండగా, పరకాల పట్టణంలోని మునిసిపాలిటీ మెజార్టీ మహిళల, పండితుల అభిప్రాయం ప్రకారం 29న సద్దుల బతుకమ్మ జరుపుకోవాలని కమిషనర్ పేరిట మునిసిపల్ కార్యాలయం నుంచి ప్రకటన వెలువడటం గమనార్హం.

## ఈనెల 30న సద్దుల బతుకమ్మ

**ప్రభుత్వం అధికారికంగా ప్రకటన**

హనుమకొండ (ఆంధ్రజ్యోతి) : సద్దుల బతుకమ్మను ఈనెల 30వ తేదీన జరుపుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం కోరింది. ఈ మేరకు ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి కె.రామక్రిష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత బతుకమ్మ పండుగను రాష్ట్ర పండుగా ప్రభుత్వం ప్రకటించింది తెలిసిందే. ఈ మేరకు ఈనెల 30న సద్దుల బతుకమ్మ పర్వదినమని ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది. ఆ రోజు మహిళలు సద్దుల బతుకమ్మ జరుపుకునేలా అన్ని ఏర్పాట్లు చేయాలని, తగిన భద్రత కల్పించాలని ఆ ఉత్తర్వుల్లో సీఎస్ పేర్కొన్నారు. కాగా, పండితులు, పంచాంగకర్తలు.. శాస్త్రం, సంప్రదాయం ప్రకారం ఈనెల 29నే సద్దుల బతుకమ్మను జరుపుకోవాలని సూచించగా, ప్రభుత్వం 30న సద్దులు అని ఉత్తర్వులు విడుదల చేయడం విశేషం.

# కలెక్టరేట్‌లో ఘనంగా బతుకమ్మ వేడుకలు

హనుమకొండ కలెక్టరేట్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో శనివారం రాత్రి హనుమకొండ కలెక్టరేట్‌లో ఘనంగా బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ హాజరై బతుకమ్మకు బొట్టు పెట్టి, జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం పెద్ద సంఖ్యలో మహిళా ఉద్యోగినులు పాల్గొని బతుకమ్మ ఆడిపాడారు. ఈ సందర్భగా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ తెలంగాణ ఆడపడుచులు ఎంతో వైభవంగా బతుకమ్మ పండుగను జరుపుకుంటారన్నారు. జిల్లాలోని మహిళలందరు ఈ సద్దుల బతుకమ్మ పండుగను సంతోషంగా జరుపుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి మేన శ్రీను, జిల్లా రెవెన్యూ అధికారి వై.వి గణేష్, ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్ రాజేందర్, టీఎన్‌జీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బైరి సోమయ్యతోపాటు పెద్ద సంఖ్యలో ఉద్యోగ సంఘా జేఏసీ నాయకులు, టీఎన్‌జీఓస్ నాయకులు పుల్లూరు వేణుగోపాల్, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.



బతుకమ్మ వేడుకల్లో టీఎన్జీవో నాయకులు



హనుమకొండ కలెక్టరేట్‌లో బతుకమ్మ ఆడుతున్న ఉద్యోగినులు



బతుకమ్మ వేడుకల్లో ఫైర్ గన్ పేల్చుతున్న కలెక్టర్ స్నేహ శబరీష్

# కేసముద్రం మండలంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీల రిజర్వేషన్లు ఇవే..

కేసముద్రం, సెప్టెంబర్ 27 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం మండలంలో 29 గ్రామాల్లో 15 జీపీల్లోని సర్పంచ్ స్థానాలు ఎస్టీలకు, రెండు ఎస్సీలకు, ఎనిమిది బీసీలకు, నాలుగు జనరల్‌కు రిజర్వు చేయబడ్డాయి. ఇందులో ఇంటికన్నె, కాట్రపల్లి, బిచ్యానాయక్‌తండా, క్యాంపుతండా, మర్రితండా, సప్పిడిగుట్టతండా, సర్వాపురంతం డా, చంద్రుతండా సర్పంచ్ స్థానాలు ఎస్టీ జనరల్‌కు, భూక్యరాంతండా, ధర్మారంతండా, పీక్లాతండా, తౌర్యతండా, బేరువాడ, నారాయణపురం, వెంకటగిరి ఎస్టీ (మహిళ), అన్నారం ఎస్సీ (జనరల్), మహమూద్‌పట్నం ఎస్సీ (మహిళ), అర్పనపల్లి, కోరుకొండపల్లి, తాళ్లపూసపల్లి, భవానిగడ్డతండా బీసీ(జనరల్), కల్వల, గాంధీనగర్, పెద్దమోరీతండా, రంగాపురం బీసీ (మహిళ), బోడమంచ్యాతండా, పెనుగొండ జనరల్, నర్సింహులగూడెం, ఉప్పరపల్లి జనరల్ (మహిళ)కు కేటాయించారు.

### ఎంపీటీసీ రిజర్వేషన్లు..

జడ్పీటీసీ ఎస్టీ (మహిళ) ఎంపీపీ ఎస్టీ (జనరల్)కు రిజర్వు చేశారు. మండలంలోని 11 ఎంపీటీసీల్లో ఇంటికన్నె, కోరుకొండపల్లి ఎస్టీ(జనరల్), తాళ్లపూసపల్లి, పెనుగొండ ఎస్టీ(మహిళ), కల్వల ఎస్సీ (జనరల్), కాట్రపల్లి, రంగాపురం, బేరువాడ బీసీ (జనరల్), ఉప్పరపల్లి, మహమూద్ పట్నం బీసీ (మహిళ), నారాయణపురం జనరల్‌కు కేటాయించారు.

### ఇనుగుర్తి మండలం సర్పంచ్‌లు..

● ఇనుగుర్తి : ఇనుగుర్తి మండలంలోని 13 జీపీల్లో ఏడు ఎస్టీలకు, రెండు ఎస్సీలకు, మూడు బీసీలకు, ఒక సర్పంచ్ స్థానం జనరల్‌కు రిజర్వు చేశారు. ఇందులో చీన్యాతండా, లాలుతండా, పెద్దతండా ఎస్టీ (మహిళ), మీట్యాతండా, పాతతండా, తారాసింగత్‌తండా, రాముతండా ఎస్టీ(జనరల్), ఇనుగుర్తి ఎస్సీ (జనరల్), చిన్ననాగారం ఎస్సీ (మహిళ), చిన్నముప్పారం బీసీ (మహిళ), అయ్యగారిపల్లి, కోమటిపల్లి బీసీ (జనరల్), లక్ష్మీపురం జనరల్‌కు కేటాయించారు.

### ఎంపీటీసీల రిజర్వేషన్లు..

ఇనుగుర్తిలోని ఆరు ఎంపీటీసీల్లో అయ్యగారిపల్లి ఎస్టీ(మహిళ), కోమటిపల్లి ఎస్టీ(జనరల్), ఇనుగుర్తి-1 ఎస్సీ(జనరల్), ఇనుగుర్తి-2 బీసీ(మహిళ), చిన్ననాగారం, చిన్నముప్పారం బీసీ(జనరల్)కు కేటాయించారు. జడ్పీటీసీ, ఎంపీపీ ఎస్టీ (మహిళ)కు రిజర్వు చేశారు.

### మహబూబాబాద్ సర్పంచ్‌ల రిజర్వేన్లు..

● మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ మండలంలో మొత్తం 41 గ్రామపంచాయతీలు ఉండగా.. అందులో 25 ఎస్టీ, 03 ఎస్సీ, 10 బీసీ, 03 జనరల్ స్థానాలు రిజర్వు చేశారు. అందులో ఎస్టీ కేటగిరిలో వేంనూరు, బోడగుట్టతండా, సికింద్రాబాద్‌తండా, చోక్లతండా, దామ్యతండా, గుండాలగడ్డ తండా, రేగడితండా, రోటిబండతండా, సాదుతండా, సండ్రాలగూడెం, సీత్లాతండా, కేవులాతండా, తూర్పుతండా, ఎస్టీ మహిళ కేటగిరిలో రెడ్యాల, లక్ష్మీపురం, మొట్లతండా, అయోధ్య, దర్గాతండా, హజారియాతండా, ఇస్లావత్ (ఎం)తండా, ఇస్లావత్ (ఎస్)తండా, కొమ్ముగూడెం, లక్మాతండా, సోమ్లతండా, ఎస్సీ కేటగిరిలో మాధవాపురం, అమనగల్, వీఎస్.లక్ష్మీపురం (ఎస్సీ మహిళ), బీసీ జనరల్ కేటగిరిలో ముడుపుగల్, నడివాడ, సింగారం, బలరాంతండా, లక్ష్మీపురంతండా, బీసీ మహిళ కేటగిరిలో పర్వతగిరి, కంబాలపల్లి, గడ్డిగూడెంతండా, చిన్నకిష్టాపురం, ఇంద్రనగర్ కాలనీ, జనరల్ కేటగిరిలో మల్యాల, ఉత్తరతండా, జంగిలిగొండ (జనరల్ మహిళ)లకు రిజర్వు చేశారు.

### ఎంపీటీసీ స్థానాలు..

మహబూబాబాద్ మండలంలో 13 ఎంపీటీసీ స్థానాలకు గాను.. 6 ఎస్టీ, 4 బీసీ, 3 జనరల్ రిజర్వు చేశారు. అందులో ఎస్టీ మహిళ కేటగిరిలో అమనగల్, వీఎస్.లక్ష్మీపురం, నడివాడ, ఎస్టీ జనరల్ కేటగిరిలో జంగిలిగొండ, రెడ్యాల, కంబాలపల్లి, బీసీ మహిళ కేటగిరిలో ఉత్తరతండా, పర్వతగిరి, బీసీ జనరల్ కేటగిరిలో అయోధ్య, మాధవాపురం, జనరల్ కేటగిరిలో సీత్లాతండా (మహిళ), బ్రహ్మణపల్లి లక్ష్మీపురం, మల్యాలలు ఉన్నాయి.

### కురవి సర్పంచ్‌లు..

● కురవి : మండలంలో 41 జీపీలు ఉండగా అందులో ఎస్టీకి 22, ఎస్సీకి 4, బీసీకి 13, జనరల్‌కు 2 స్థానాలు రిజర్వేషన్ కేటాయించారు. ఎస్టీకి రిజర్వు అయిన గ్రామపంచాయతీల్లో బలపాల, చంద్యతండా, ఎలకచెట్టుతండా, జుజుర్‌తండా, కాకులబోడ్‌తండా, కొత్తూరు(జి), కురవి, నారాయణపురం, బాల్యతండా, బంజరతండా, తులస్యతండా (ఎస్టీ మహిళ), బీబీనాయక్‌తండా (ఎస్టీ మహిళ), చిమ్లాతండా (ఎస్టీ మహిళ), రాజోలు (ఎస్టీ మహిళ) రేకులతండా(కె) (ఎస్టీ మహిళ), స్టేషన్ గుండ్రాతిమడుగు (ఎస్టీ మహిళ), తాట్యతండా (ఎస్టీ మహిళ), బేగావత్‌తండా (ఎస్టీ మహిళ), సూర్యతండా (ఎస్టీ మహిళ), పిల్లిగుండ్లతండా (ఎస్టీ మహిళ), ఎస్సీ కేటగిరిలో నేరడ, మోద్గులగూడెం, గుండ్రాతిమడుగు (ఎస్సీ మహిళ), నల్లెల్ల (ఎస్సీ మహిళ), బీసీ కేటగిరిలో అయ్యగారిపల్లి, గాజాతండా, హరిదాస్‌తండా, కంచర్లగూడెం, కందికొండ, పెద్దతండా, పోలంపల్లితండా, బీసీ మహిళకు జగ్న్యాతండా, మొగిలిచర్ల, బంచరాయితండా, బంగారిగూడెం, లింగ్యాతండా, తిరుమలాపురం, జనరల్ కేటగిరిలో సూదనపల్లి, లింగ్యాతండా (కె) రిజర్వు చేశారు.

### ఎంపీటీసీలు..

కురవిలో మొత్తం 15 ఎంపీటీసీలు స్థానాలు ఉండగా కురవి (ఎస్టీ మహిళ), మోద్గులగూడెం (ఎస్టీ), తట్టుపల్లి (ఎస్టీ మహిళ), రాజోలు (ఎస్టీ), మొగిలిచర్ల(ఎస్టీ మహిళ), నల్లెల్ల (ఎస్టీ), బలపాల (ఎస్టీ), కందికొండ (బీసీ మహిళ), నేరడ (బీసీ), గుండ్రాతిమడుగు (బీసీ), కొత్తూరు(జి) (బీసీ), నారాయణపురం (బీసీ మహిళ), గుండ్రాతిమడుగు స్టేషన్ (జనరల్ మహిళ), లింగ్యాతండ(కె) (జనరల్ మహిళ)కు రిజర్వు చేశారు.

### సీరోలు మండలం సర్పంచ్‌లు..

● సీరోలు : మండలంలో 18 గ్రామపంచాయతీలు ఉండగా ఇందులో ఎస్టీకి 11, బీసీకి 5, ఎస్సీకి 1, జనరల్ 1కి రిజర్వు చేశారు. ఎస్టీ మహిళకు రిజర్వు అయిన గ్రామాల్లో అందనాపాడు, కొర్లకుంట తండ, పెద్దలాలుతండా, రేకులతండా, మోదుగుగడ్డతండా, ఎస్టీ జనరల్‌కు బిల్యానాయక్‌తండా, బూరుగుచెట్టుతండా, గోపాతండా, కాంపెల్లి తండా, వస్త్రంతండా, బీల్యాతండా, ఎస్సీ కేటగిరిలో తాళ్ల సంకీస, బీసీ కేటగిరిలో చిలుక్కోయలపాడు, మన్నెగూడెం, ఉప్పరిగూడెం, బీసీ మహిళకు కాంపెల్లి, సీరోలు, జనరల్ కేటగిరిలో చింతపల్లి గ్రామాలు ఉన్నాయి.

### డోర్నకల్ మండలంలో సర్పంచ్‌లు ..

● డోర్నకల్ : డోర్నకల్ మండలంలో 26 సర్పంచ్ స్థానాలు ఉండగా అందులో 15 ఎస్టీ, 7 బీసీ, 2 ఎస్సీ, 2 జనరల్ కేటగిరిలను రిజర్వు చేశారు. ఇందులో ఎస్టీ కేటగిరిలో వెన్నారం, ఉయ్యాలవాడ, తోడేళ్లగూడెం, తెల్లబండతండా, రావిగూడెం, పాతదుబ్బతండా, ముల్కలపల్లి, మల్లయికుంటతండా, లింబ్యాతండా(ఎస్టీ మహిళ), కొత్తదుబ్బతండా, జోగ్యతండా, గుర్రాలకుంటతండా, దుబ్బతండా, బూరుగుపాడు, బొడ్రాయితండాలు ఉన్నాయి. బీసీ కేటగిరిలో రాముతండా, కన్నెగుండ్ల (బీసీ మహిళ), గొల్లచర్ల (బీసీ మహిళ), పకీరాతండా, చిల్కోడు (బీసీ మహిళ), చాంప్లాతండా, బంజరలకు రిజర్వు చేశారు. ఎస్సీ కేటగిరిలో అమ్మపాలెం (ఎస్సీ మహిళ), పెరుమాండ్ల సంకీస, జనరల్ కేటగిరిలో కస్నాతండా (జనరల్ మహిళ), హన్మతండాలకు రిజర్వు చేశారు.

### ఎంపీటీసీ స్థానాలు..

డోర్నకల్ మండలంలో మొత్తం 10 ఎంపీటీసీ స్థానాలు ఉండగా అందులో 5 ఎస్టీ, 03 బీసీ, జనరల్ 02లకు రిజర్వు చేశారు. ఎస్టీ కేటగిరిలో పెరుమాండ్ల సంకీస (ఎస్టీ మహిళ), ఉయ్యాలవాడ (ఎస్టీ మహిళ), ముల్కలపల్లి (ఎస్టీ జనరల్), అమ్మపాలెం (ఎస్టీ జనరల్), తోడేళ్లగూడెం (ఎస్టీ జనరల్), బీసీ కేటగిరిలో గొల్లచర్ల (జనరల్), వెన్నారం (జనరల్), చిల్కోడు (బీసీ మహిళ), జనరల్ కేటగిరిలో బూరుగుపాడు, కస్నాతండా (జనరల్ మహిళ) రిజర్వు చేశారు.



కేసముద్రంలో కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పద్మశాలి సంఘం నేతలు



జిల్లా పోలీసుశాఖ కార్యాలయంలో కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్ర పటం వద్ద పోలీసు అధికారులు



కలెక్టరేట్‌లో కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, అధికారులు

# ఘనంగా కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి

మహబూబాబాద్ టౌన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా స్వాతంత్ర్య సమరయోధులు, తెలంగాణ తొలి దశ ఉద్యమ కారులు, మాజీ మంత్రి కొండా లక్ష్మణ్‌బాపూజీ జయంతిని శనివారం నిర్వహించారు. అన్ని మండల కేంద్రాల్లో ఆయన చిత్ర పటాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. జిల్లా కలెక్టరేట్‌లో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కొండా లక్ష్మణ్‌బాపూజీ జయంతిని నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమమంలో జిల్లా అధికారులు శ్రీనివాసరావు, మరియన్న, పవన్‌కుమార్, పద్మశాలి సంఘం ప్రతినిధులు చిలకమారి వెంకటేశ్వర్లు, అనుమాల వెంకటేశ్వర్లు, వి. వెంకన్న, బొమ్మ వెంకటేశ్వర్లు, చలమల నారాయణ పాల్గొన్నారు.

● పోలీసు శాఖ జిల్లా కార్యాలయంలో కొండా లక్ష్మణ్‌బాపూజీ జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు శ్రీనివాస్, గుండ్రాతి మోహన్, నరేందర్, సత్యనారాయణ, భాస్కర్, నాగేశ్వర్‌రావు, సోములు, వెంకన్న, రాధాబాయి, చంద్రకాంత్ పాల్గొన్నారు.

● మునిసిపల్ కార్యాలయంలో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని పురస్కరించు కుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా మునిసిపల్ కమిషనర్ టి.రాజేశ్వర్ మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమంలో, తెలంగాణ తొలి దశ ఉద్యమంలో పోరాడిన మహోన్నత వ్యక్తి కొండా లక్ష్మణ్‌బాపూజీ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ శ్రీధర్, ఏఈ కుమార్, శ్రీదేవి, కరుణాకర్, లత పాల్గొన్నారు.

### వివిధ మండలాల్లో..

● చిన్నగూడూరులోని దాశరథి సెంటర్‌లో పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పినంచారు. ఈ కార్యక్రమంలో దాసరి నరేందర్, పులిపాటి నాగన్న, కుసుమ వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, రాంప్రకాశ్, వేణు పాల్గొన్నారు.

● తొర్రూరు మునిసిపాలిటీ కార్యాలయంలో కొండా లక్ష్మన్ బాపూజీ జయంతి నిర్వహించారు. ఈకార్యక్రమంలో కమిషనర్ వి. శ్యాంసుందర్, మేనేజర్ కట్ట స్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

● కేసముద్రం పద్మశాలి భవనంలో మండల అధ్యక్షుడు దాసరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని నిర్వహించారు. ఈకార్యక్రమంలో కామిని కుమారస్వామి, బొద్దుల సురేందర్, చిట్యాల వీరన్న, మిడతలపల్లి ప్రకాశ్, రాజేష్, సమ్మయ్య, సోమేఉశ్వర్, కృష్ణమూర్తి , అల్లూరు పాల్గొన్నారు.

● ఇనుగుర్తి మండలం చెట్ల ముప్పారంలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో కొడా లక్ష్మణ్ బాపూజీ జయంతిని నిర్వహించారు. ఈకార్యక్రమంలో బోగ అనిల్, గోనె రవికుమార్, గోనెపర్తి వెంకటేశ్వర్లు, గోనె పరమేశ్వర్, శ్రీనివాస్, అశోక్ , వెంకట్రాం నర్సయ్య, శేఖర్, బుచ్చయ్య, నరేష్‌విక్రమ్, యాకయ్య, రాజు పాల్గొన్నారు.

● కొత్తగూడలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుసుమ రాజన్‌బాబు పూలమాల వేసి నివాళులర్పించారు. కొండా లక్ష్మణ్ బాపూజీ చేసిన సేవలను కొనియాడారు. గుర్లపల్లి శ్రీను, దేవుళపల్లి రాజు, కుసుమ రాజేశ్వరీ, మేరుగు రజనీ, పూల యాదగిరి, వలపుదాసు వెంకటనారాయణ, సాంబశివుడు, సామల రమేష్, మంచికట్ల రాము, మేరుగు శ్రీను, వెల్దండి వేణు పాల్గొన్నారు.



వికాస్ జూనియర్ కళాశాల బతుకమ్మ వేడుకలో పాల్గొన్న కరస్పాండెంట్ వెంకటేశ్వర్లు, చైర్ పర్సన్ ఇందిర

## 'తెలంగాణ ప్రత్యేకతకు నిదర్శనం బతుకమ్మ'

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ప్రత్యేకతకు నిదర్శనం బతుకమ్మ అని కరస్పాండెంట్ బిక్కి. వెంకటేశ్వర్లు అన్నారు. మహబూబాబాద్ వికాస్ జూనియర్ కళాశాలలో శనివారం ఏడవ రోజు వేపకాయల బతుకమ్మలను పేర్చి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గత 15 సంవత్సరాలుగా కళాశాలలో ప్రతి పండుగ వేడుకలు నిర్వహిస్తూ వాటి ప్రాముఖ్యతను వివరిస్తున్నామని పేర్కొన్నారు. కళాశాల చైర్ పర్సన్ ఇందిర నేతృత్వంలో జరిగిన ఈ వేడుకల్లో ప్రిన్సిపల్ వీరన్న, అధ్యాపకులు రవీందర్, రాజేశ్వరి, సునిత, మధు, రమేష్, నాగరాజు, సారంగం, యాకన్న, బిక్షపతి, నరేష్, విద్యార్థినులు అస్మిత, దీక్ష, అక్షయ, జ్యోత్స్న, ప్రియాంక, మాధవి, శ్రీజ, స్నేహ పాల్గొన్నారు.

# మద్యం ప్రియులకు ము(మ)ందు జాగ్రత్త

నెహ్రూసెంటర్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని ఓ వైన్స్ షాపు ఎదుట మందుబాబులకు మందు జాగ్రత్తతో కూడిన ఓ బ్యానర్‌ను శనివారం ప్రత్యక్షమైంది. అక్టోబరు 2న దసరా పర్వదినం ఉంది. అదే రోజున గాంధీ జయంతి కావడంతో ఆ రోజు మద్యం దుకాణాలు బంద్ చేయడంతో మాంస విక్రయాలు కూడా జరగవు. ఈ క్రమంలో మందు బాబులకు ముందస్తు సమాచారంలో భాగంగా వైన్స్‌షాపు ఎదుట అక్టోబరు 2న గాంధీ జయంతి షాపు బంద్ అంటూ బ్యానర్‌ను ఏర్పాటు చేశారు. అంటే మద్యం ప్రియులకు ముందుగానే కొనుగోలు చేసుకునేలా సమాచారం అందిస్తున్నారు. ఇంతవరకు బాగానే ఉంది మరి మాంసం సంగతేంటి? అని ప్రజలు చర్చించుకుంటున్నారు. దసరా ముందురోజు అక్టోబరు 1న మాంసం కూడా కొనుగోలు చేసుకుని ఫ్రిజ్‌లో దాచుకోవాలని చర్చ జరుగుతోంది. గతంలోనూ ఓ సంవత్సరం ఇదే మాదిరిగా అక్టోబరు 2 దసరా రావడంతో ఒకరోజు ముందు 1వ తేదీన అటు మందు, ఇటు మాంసం కొనుగోలు చేసుకుని దాచుకున్నామని, ఈ సంవత్సరం కూడా అదే పరిస్థితి వచ్చిందని చర్చించుకుంటున్నారు.




మానుకోటలోని ఓ వైన్స్‌షాపు ఎదుట ఏర్పాటు చేసిన బ్యానర్

## దివ్యాంగుడికి వీల్‌చైర్ అందజేత

మహబూబాబాద్ రూరల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కోర్టు ఆవరణలో రైలు ప్రమాదంలో కాలు కోల్పోయిన మానుకోట వాసి సోమేశ్వర్‌రెడ్డికి ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ (ఐఆర్‌సీఎస్) సహకారంతో శనివారం వీల్ చైర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి మహ్మద్ అబ్దుల్ రఫీ మాట్లాడుతూ రెడ్ క్రాస్ సంస్థ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు. కాళ్లు కోల్పోయిన వ్యక్తికి వీల్‌చైర్‌ను అందించిన ఐఆర్‌సీఎస్ బాధ్యులను అభినందించారు. సీనియర్ సివిల్ జడ్జీ శాలిని, ఐఆర్‌సీఎస్ జిల్లా చైర్మన్ పీవీ. ప్రసాద్, కోశాధికారి మాధవపెద్ది వెంకట్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రావుల రవి చందర్‌రెడ్డి, న్యాయ సలహాదారులు కొండపల్లి కేశవరావు పాల్గొన్నారు.

### వారధిగా నిలవాలి..

**జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి**

పారా లీగల్ వలంటీర్లు న్యాయమూర్తులకు వారధిగా నిలవాలని జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి మహ్మద్ అబ్దుల్ రఫీ అన్నారు. మహబూబాబాద్ జిల్లా కోర్టు ఆవరణలో పారా లీగల్ వలంటీర్లకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా గ్రామాల నుంచి ఆసక్తి ఉన్న వ్యక్తులను ఎంపిక చేసి శిక్షణ ఇస్తున్నట్లు జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి మహ్మద్ అబ్దుల్ రఫీ తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు స్వాతి మురారి, కృష్ణతేజ్, న్యాయవాదులు మల్లారెడ్డి, మహేందర్ పాల్గొన్నారు.

# ఖైదీలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

**● మానుకోట జిల్లా కోర్టు సీనియర్ సివిల్ జడ్జీ శాలిని**

మహబూబాబాద్ రూరల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఖైదీలు చట్టాల పట్ల అవగాహన కలిగి ఉండాలని మానుకోట జిల్లా కోర్టు సీనియర్ సివిల్ జడ్జీ శాలిని అన్నారు. మహబూబాబాద్ సబ్ జైలును శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జైలు శిక్ష అనుభవిస్తున్న సమయంలో సమయాన్ని సద్వినియోగం చేసుకుని చట్టాల పట్ల అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఒక్కసారి నేరం చేసి జైలుకు వస్తే మరో సారి జైలుకు రాకుండా తన ప్రవర్తనలో మార్పు తెచ్చుకోవాలన్నారు. ఖైదీలకు అందిస్తున్న సౌకర్యాలపై సబ్ జైలు సూపరిండెంట్ మల్యాల శ్రీనివాస్‌ను అడిగి తెలుసుకున్నారు.

### ఆరోగ్యమే మహాభాగ్యం..

ఆరోగ్యమే మహాభాగ్యమని, సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్త వహించాలని జిల్లా కోర్టు సీనియర్ సివిల్ జడ్జీ శాలిని అన్నారు. మహబూబాబాద్ శివారు ఇందిరానగర్ కాలనీలో బాలుర చిల్డ్రన్ హోంను శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కోర్టు సీనియర్ సివిల్ జడ్జీ శాలిని మాట్లాడుతూ...వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, పిల్లలు ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం జిల్లా ఆస్పత్రి ఆధ్వర్యంలో వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆర్ఎంవో జగదీష్, వైద్యులు ప్రదీప్, రాంబాబు, చిల్డ్రన్ హోం సూపరిండెంట్ కృష్ణవేణి పాల్గొన్నారు.



మహబూబాబాద్ సబ్ జైలులో మాట్లాడుతున్న శాలిని

## యూరియా కోసం వస్తే పాము కాటు

కొడకండ్ల, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : యూరియా కష్టాలు రైతు ప్రాణాల మీదికి తెచ్చింది. యూరియా కోసం లైన్లో నిలబడ్డ బాలు అనే రైతు ను పాము కాటేసిన ఘటన జనగామ జిల్లా కొడకండ్ల మం డల కేంద్రంలో శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. మండలకేంద్రంలోఉన్న గ్రోమో ర్ సెంటర్‌వద్ద వెలిశాల గ్రామ పరిధి ఎంకే తండాకు చెందిన రైతు బాలు శనివారం టోకెన్ తీసుకొని యూ రియా కోసం లైన్లో నిలబడ్డాడు. వెనుకనుంచి వచ్చిన పాము కాలుపై కాటేసిం ది. దీంతో అక్కడే ఉన్న స్థానికులు పీహెచ్‌సీకి తీసుకెళ్లగా వైద్యులు ప్రథమ చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించామని, ఎలాంటి ప్రాణాపాయం లేదని డాక్టర్ హరికృష్ణ తెలిపారు.

## ఇనుగుర్తి ఇన్‌చార్జి ఎంపీడీవోగా పార్థసారథి



ఇనుగుర్తి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఇనుగుర్తి ఇన్‌చార్జి ఎంపీడీవోగా బండారు పార్థసారథి శనివారం విధుల్లో చేరారు. మహబూబాబాద్ మండల పంచాయతీ అధికారిగా పనిచేస్తున్న ఆయనకు అదనపు బాధ్యతలను జిల్లా అధికారులు అప్పగించారు. ఇక్కడ పనిచేస్తున్న ఇన్‌చార్జి ఎంపీడీవోగా పనిచేస్తున్న కేసముద్రం ఎంపీవో హరిప్రసాద్ ఇటీవలె బదిలీ అయ్యారు. కాగా విధుల్లో చేరిన పార్థసారధిని పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు.

## ఐద్వా ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు

కేసముద్రం, సెప్టెంబర్ 27 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం హరిహర గార్డెన్స్‌లో శనివారం అఖిల భారత ప్రజాతంత్ర మహిళ సంఘం(ఐద్వా) ఆధ్వర్యంలోబతుకమ్మ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ పాటలు పాడుతూ బతుకమ్మ ఆడారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి అల్పుగొండ సావిత్ర, అధ్యక్షురాలు పొన్నాల జ్యోతి, తోట యాకమ్మ, నూకల కవిత, జాన్‌పాటి జ్యోతి, అల్పుగొండ మేఘన, తోట సునీత, బోడ శిరీష, మేకల లక్ష్మి, నాగమ్మ, భద్రమ్మ పాల్గొన్నారు.



అడ్వాన్స్ ట్రైనింగ్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న మురళీనాయక్

## యువతకు ఉపాధి కల్పనే కాంగ్రెస్ సర్కార్ లక్ష్యం

**● మానుకోట ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్**

మహబూబాబాద్ టౌన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో యువతకు ఉపాధి కల్పించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని స్థానిక ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. మల్లెపల్లి నుంచి రాష్ట్ర వ్యాప్తంగా 45 అడ్వాన్స్ ట్రైనింగ్ సెంటర్లను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శనివారం వర్చువల్ పద్ధతిలో ప్రారంభించారు. అందులో భాగంగా మానుకోటలో రూ.63 కోట్లతో నిర్మించిన అడ్వాన్స్ ట్రైనింగ్ సెంటర్ (ఏటీసీ) ను స్థానిక ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో ఐటీఐ కళాశాలలు మూత పడ్డాయని, నిరుద్యోగ యువతను నట్టేట ముంచారని విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిరుద్యోగులకు అనేక ఉద్యోగ అవకాశాలు కల్పించినట్లు తెలిపారు. మానుకోట ఏటీసీ సెంటర్ నుంచి ప్రతి ఏటా 170 మంది నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు లెనిన్‌వత్సల్ టొప్పో, కె. అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

# లంబాడీల ఆత్మగౌరవ సభకు తరలిరావాలి

నెహ్రూసెంటర్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఎస్టీ జాబితాలో లంబాడీలను తొలగించాలనే కుట్రలను తిప్పికొడుతూ.. మానుకోటలో నేడు ఆదివారం నిర్వహించే లంబాడీల ఆత్మగౌరవ సభకు జిల్లా నలుమూలల నుంచి భారీగా తరలిరావాలని జేఏసీ వైస్ చైర్మన్ గుగులోతు కిషన్‌నాయక్ పిలుపునిచ్చారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో తహసీల్ సెంటర్‌లో ఆత్మగౌరవ సభా స్థలాన్ని పరిశీలించి అంబేద్కర్ సెంటర్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కిషన్‌నాయక్ మాట్లాడుతూ.. లంబాడీల ఆత్మగౌరవ పరిరక్షణ కోసం రిజర్వేషన్లను భవిష్యత్ తరాలకు అందించడానికి మానుకోటలో జరిగే లంబాడీల ఆత్మగౌరవ సభకు ప్రతి తండాకు జిల్లా నలుమూలల నుంచి భారీగా తరలిరావాలని విజ్ఞప్తి చేశారు. ఎస్టీ జాబితా నుంచి తొలగించాలనే కుట్రను ప్రతి ఒక్కరు తిప్పి కొట్టాల్సిన అవసరం ఉందన్నారు. గిరిజన తెగల మధ్య చిచ్చుపెడుతున్న వారికి తగిన గుణపాఠం తప్పదన్నారు.

ఈ సమావేశంలో జేఏసీ కన్వీనర్లు బోడ పృధ్వీరాజ్‌నాయక్, దారావత్ వెంకన్ననాయక్, గుగులోతు భీమానాయక్, గుగులోతు హరినాయక్, బోడ రమేష్‌నాయక్, నాయకులు బోడ లక్ష్మణ్, మోతీలాల్, హరిలాల్, చందూలాల్, బిక్కునాయక్, వెంకన్న, హట్యనాయక్ తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న గుగులోతు కిషన్‌నాయక్

## జడ్పీ చైర్‌పర్సన్ల రిజర్వేషన్లు ఖరారు

**ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఆరు జడ్పీలు**

**2 ఎస్టీలకు, 2 ఎస్సీలకు 1 బీసీకి, 1 జనరల్‌కు రిజర్వు**

హనుమకొండ, సెప్టెంబర్ 27 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పదవుల రిజర్వేషన్లను రాష్ట్రప్రభుత్వం శనివారం ఖరారు చేసింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఆరు జిల్లా పరిషత్‌లలో రెండు ఎస్టీలకు, రెండు ఎస్సీలకు, ఒకటి బీసీకి రిజర్వు కాగా, ఒకటి జనరల్ అయింది. మూడు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పదవులు మహిళలకు కేటాయించారు. మూడు జనరల్‌గా ప్రకటించారు. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ అమలులోకి వచ్చినప్పటికీ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పదవులను రాష్ట్రం యూనిట్‌గా తీసుకొని రిజర్వు చేయడం వల్ల ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఆ వర్గానికి ఒక్క స్థానమే దక్కింది. హనుమకొండ జిల్లా పరిషత్ ఎస్సీ మహిళకు రిజర్వు కాగా, వరంగల్ జిల్లా జిలా పరిషత్ ఎస్టీ జనరల్‌కు రిజర్వు అయింది. జనగామ ఎస్సీ మహిళ, జయశంకర్ భూపాలపల్లి జిల్లా బీసీ జనరల్, ములుగు ఎస్టీ మహిళకు, మహబూబాబాద్ జనరల్ రిజర్వు అయింది.